క్లుప్తంగా

60 మందికి కంటి పరీక్షలు



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మధుసూదన రాజు

తాడిపత్రి టౌన్: మండల పరిధిలోని దిగువపల్లి గ్రామంలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి, 6 మందిని కంటి ఆపరేషన్లను ఎంపిక చేసినట్లు కంటి వైద్యాధికారి మధుసూదన రాజు తెలిపారు. కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసిన వారికి జూన్ నెలలో శస్త్ర చికిత్సలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరామిరెడ్డి, చుక్కలూరు వైద్యాధికారి లావణ్య పాల్గొన్నారు.

రుణాల రికవరీ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న పీఏసీఎస్ జిల్లా చైర్‌పర్సన్ లిఖిత

యాడికి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాల రికవరీ వేగవంతం చేయటమే కాకుండా వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులతో రెన్యువల్‌ను చేయించాలని పీఏసీఎస్ జిల్లా చైర్‌పర్సన్ లిఖిత తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వేములపాడు రహదారిలో ఉన్న సహకార బ్యాంకును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిజినెస్‌ను మరింతగా పెంచాలని.. డిపాజిట్లు విరివిగా సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. బ్యాంకులో ఎక్కువ అప్పులు తీసుకున్న వారితో కచ్చితంగా రెన్యువల్ చేయించాలన్నారు. పొదుపు సంఘాల మహిళలకు సహకార బ్యాంకులో తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం మేనేజర్ దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





గాయపడిన ప్రసాద్, గురునాథ్

గుత్తి: గుత్తి శివారులోని టోల్ గేట్ సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ప్రసాద్, గురునాథ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా ఆహోబిలంకు చెందిన బావాబామరుదులు ప్రసాద్, గురునాథ్ కేశఖండనానికి సంబంధించిన పత్రికలు పంచేందుకు అహోబిలం నుంచి పామిడికి బైక్‌లో బయలు దేరారు. అయితే మార్గమధ్యలోని టోల్ గేట్ సమీపంలో బైక్‌కు అడ్డంగా ఆవు వచ్చింది. ఆవును తప్పించబోయి బైక్ అదుపు తప్పింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. హైవే అంబులెన్స్‌లో వారిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రూ.3 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



తిమ్మంపేటలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: మండల పరిధిలోని తిమ్మంపేటలో ఆలూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా పలు గ్రామాల్లో ఆలూరు ఫౌండేషన్ ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శుద్ధనీటిని అందిస్తున్నామన్నారు. తిమ్మంపేటలో రూ.3 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. అలాగే భవిష్యత్తులో కూడా ఆలూరు ఫౌండేషన్ ద్వారా సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భార్గవి, మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, ఎంపీటీసీ గీతా భవాని, జంబులదిన్నె సొసైటీ డైరెక్టర్ వెంకటశివారెడ్డి, లింగారెడ్డి, రామచంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం

పెద్దవడుగూరు: మండలంలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. గాలి తీవ్రతకు పెద్దవడుగూరు నుంచి మేడిమాకులపల్లికి వెళ్లే 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్న 10 స్తంభాలు నేలకూలాయి. మేడిమాకుపల్లి, తెలికి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పెద్దవడుగూరులో పోతులయ్య కట్ట వద్ద, గ్రామ సచివాలయం-2 వద్ద ఉన్న భారీ వృక్షాలు నేలకొరిగాయి. గాలీవాన వచ్చే సమయంలో సచివాలయ సిబ్బంది కార్యాలయంలోనే ఉండటంతో ప్రమాదం తప్పింది. పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి సచివాలయం వద్దకు చేరుకొని కూలిన చెట్లను తొలగించడానికి చర్యలు చేపట్టారు.

ప్రజా సంక్షేమ యాత్రకు బ్రహ్మరథం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి పూలమాలలతో స్వాగతం
- అన్ని వర్గాల ప్రజలను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే
- తాడిపత్రి మండలంలో ముగిసిన ప్రజా సంక్షేమ యాత్ర
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు



సీబీ రోడ్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు



అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన ప్రజా సంక్షేమ యాత్రలో మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: తాడిపత్రి మండలంలో 12 రోజులుగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర సోమవారం ముగిసింది. చివరి రోజైన సోమవారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ప్రజా సంక్షేమ యాత్రకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. నాయకులు, కార్యకర్తలు డప్పుల మధ్య టపాసులు కాల్చుతూ సీఎం జగన్ జిందాబాద్.. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నాయకులతో కలసి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి సీబీ రోడ్డు మీదుగా అశోక్ పిల్లర్, గాంధీ సర్కిల్, యల్లనూర్ రోడ్డు మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు ప్రజా సంక్షేమ యాత్ర చేపట్టారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దారి పొడవునా అవ్వా, తాత, అక్కాచెల్లెమ్మ, తమ్ముడు అని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీబీ రోడ్డుకు ఇరువైపులా ప్రజలు, మహిళలు, పిల్లలు నిలబడి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేవలం నాలుగేళ్లలోనే సంస్కరణల ద్వారా పాలన వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిరునామాగా మారిందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. కుల, మత, వర్గం, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నను మరొక్కసారి ఆశీర్వదించాలని కోరారు. మళ్లీ సంక్షేమ పథకాలు అందాలంటే తప్పక వైఎస్సార్‌సీపీని గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచెం రాంమోహన్‌రెడ్డి, ఏపీ రజక కార్పొరేషన్ డైరెక్టర్ మీసాల రంగన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయరెడ్డి, ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ హరినాథరెడ్డి, ఓబులరెడ్డి, తాడిపత్రి జెడ్పీటీసీ కురవ రమణమ్మ, తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు మండలాల కన్వీనర్లు నాగేశ్వరరెడ్డి, బొంబాయి రమేష్, ఎద్దుల శరాభారెడ్డి, మాజీ ఎంపీపీ సుంకిరెడ్డి, యాడికి మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, నాయకులు రంగస్వామి యాదవ్, పుల్లారెడ్డి, కాకర్ల రంగనాథ్, రామచంద్రారెడ్డి, రామేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామశేఖర్, హనుమంతరెడ్డి, ఆకుల పెద్దనాగిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, శివారెడ్డి, కందిగోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి, రఘునాథరెడ్డి, వేమనాథరెడ్డి, ఎంపీటీసీ రవి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాతో నడిచిన అందరికీ కృతజ్ఞతలు

మూడో విడత ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా తాడిపత్రి మండలంలో 12 రోజుల్లో.. 100 కిలోమీటర్లకు పైగా సాగిన పాదయాత్రలో తనతో పాటు నడిచిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని గన్నేవారిపల్లి కాలనీలో జరిగిన పాదయాత్ర ముగింపు బహిరంగ సభకు అశేష జనవాహిని తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. తనకు కొండంత అండగా నిలబడి.. సుదూర దూరం ప్రయాణించి ఉత్తేజాన్ని కల్గించి పాదయాత్రను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

కుటుంబాలను ఆదుకుంటాం

శింగనమల: మండలంలోని ఉల్లికల్లు గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన బాలకృష్ణ, గౌరీశంకర్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. సోమవారం బాలకృష్ణ, గౌరీశంకర్ మృతదేహాలకు నివాళులర్పించారు. అనంతరం జూలకాల్వ గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త తాతయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పరంధామరెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

యాడికి: ఘర్షణ కేసులో పరస్పర దాడులకు పాల్పడిన ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు యాడికి ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. యాడికిలోని లాలెప్ప కాలనీకి చెందిన కిట్టయ్య, రంగస్వామి కుటుంబాలు ఎదురెదురుగా ఉన్నాయి. సోమవారం సాయంత్రం ఇంటి ఎదుట కసువు ఊడ్చే విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ చోటు చేసుకుని పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దవడుగూరు: క్రిష్టిపాడు గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన విద్యుత్ ప్రమాదంలో గాయపడిన యాడికి మండలానికి చెందిన షేక్షావలి (42) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ముస్కిమ్‌బీ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో పేదల ఇంటి ముగింటకే సంక్షేమ పథకాలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జగనన్న పాలన భావితరాలకు ఆదర్శం అన్నారు. సీఎం జగన్ అన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు సేవలు అందించేందుకు వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు తన పాలనలో ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా పథకాలు టీడీపీ వారు చెప్పిన వారికి మాత్రమే వచ్చేవన్నారు. టీడీపీ మేనిఫెస్టో.. అంటూ జనాలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. సీఎం జగన్ చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఎల్లో మీడియాలో బురద జల్లుతున్నారని విమర్శించారు.

గతంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

ప్రజలకు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చారా అని చంద్రబాబును వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ప్రశ్నించారు. 600 అబద్ధపు హామీలతో మోసం చేశారని మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు పథకాలు అందిస్తున్నామన్నారు. ఏదైనా కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందకుంటే.. వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, సీనియర్ నాయకుడు ఆలూరి రమణారెడ్డి, తహసీల్దార్ మోహన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, ఎంపీడీఓ విజయ భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, సుజాత, ఉప సర్పంచ్ వరలక్ష్మి, పూల నారాయణస్వామి, బుల్లే నారాయణ స్వామి, చికెన్ నారాయణస్వామి, చేపల రమణ, ముత్యాల శీన, కొండమ్మ, పురుషోత్తం, చంద్రమోహన్ పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు



గుంతకల్లుటౌన్: బైక్ ర్యాలీలో పాల్గొన్న యువనేత మంజునాథ రెడ్డి



గుత్తి: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- గుంతకల్లు, గుత్తిలో భారీ బైక్ ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు సుపరిపాలన అందించినందుకు జనమంతా జగనన్నే మా నమ్మకమని నినదిస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్.భవానీ, పార్టీ యువనేత సిబి.మంజునాథ రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పూర్తవడంతో పాటు అమరావతిలో నిరుపేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసినందుకు కృతజ్ఞతగా సోమవారం ఆ పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వైవీఆర్ క్యాంప్ కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ పుర వీధుల గుండా సాగింది. రావాలి జగన్-కావాలి వైవీఆర్.. మా నమ్మకం నువ్వే జగనన్న ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం మెయిన్ రోడ్డులోని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, పార్టీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రామలింగప్ప, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్ మోహన్, సచివాలయాల పట్టణ, మండల కన్వీనర్లు ఎండీ.ఖలీల్, గోవింద్‌నాయక్, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్ బాషా, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

గుత్తి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి కావడం, అమరావతిలో 50 వేలకు పైగా ఇంటి స్థలాలు ఇవ్వడంతో గుత్తిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద, గుత్తి ఆర్ఎస్‌లోని చంద్రప్రియనగర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద బైక్ ర్యాలీని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ విశాలాక్షి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు గురుప్రసాద్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, వెల్డింగ్ రవూఫ్, రాజ్‌కుమార్ రెడ్డి, మల్లి, మర్తాడు అన్సార్, ఫయాజ్, కౌన్సిలర్లు నజీర్, వరదరాజులు, వాల్మీకి శివ, ఫరూక్, అరవింద్ బాబు, ఖాజా ఖాన్, వెంకట సుబ్బయ్య, నరేష్, అంజలి, ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, సునీల్, చంద్ర పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఎగువపల్లి వైఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులకుగా పని చేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మానస పుత్రులుగా నిలిచారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి వారికి అనుకూలమైన వారికి సంక్షేమ పథకాలు అందించేవారన్నారు. అలాగే అధికారులు కూడా టీడీపీ హయంలో ఇబ్బందులు, వేధింపులకు గురైనట్లు తెలిపారు. సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందించారా లేదా అని అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 82 శాతం మంది ప్రజలు వలంటీర్ వ్యవస్థ ద్వారా సంతోషంగా ఉన్నారన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు వలంటీర్ వ్యవస్థపై ఆసక్తి చూపుతున్నాయన్నారు. వలంటీర్లు సంక్షేమ పథకాలతో పాటు తమ గ్రామంలో జరిగిన అభివృద్ధిని లబ్ధిదారులకు వివరించాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను తొలగించి జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా వలంటీర్ల ద్వారా పారదర్శకంగా సేవలందిస్తున్నామన్నారు. అర్హులై ఉండి.. పథకాలు అందకపోతే వెంటనే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చంద్రబాబు అడ్డుకోవాలని చూస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. వలంటీర్లు ఉత్తమ సేవలు అందించాలన్నారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలు అందించి సత్కరించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్ రెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంపీటీసీలు నాగరత్నమ్మ, షాకీర, జయలక్ష్మి, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఎంఈఓ చంద్రనాయక్ పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

పామిడి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తవుతుండటంతో మంగళవారం నిర్వహించే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అలాగే ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డి ప్రమాణ స్వీకారం చేసి 4 సంవత్సరాలు పూర్తి కావడంతో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ చేపట్టనున్నారు.

టెక్నాలజీని ఉపయోగించుకోవాలి

బుక్కరాయసముద్రం: టెక్నాలజీని రైతులు ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చెదుల్ల గ్రామంలో దక్షిణ ప్రాంతీయ వ్యవసాయ పరికరముల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్‌తో పురుగుమందల పిచికారీపై అవగాహన కల్పించారు. డ్రోన్ మిషన్లను రైతులకు రాయితీతో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మి నారాయణ, దక్షిణ ప్రాంతీయ వ్యవసాయ పరికరముల పరిరక్షణ సంస్థ డైరెక్టర్ కమలాబాయి, కనకనాథ్ గోపాల్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తాడిపత్రి: స్థానిక కరెంట్ ఆఫీస్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు ఆహారం, నీరు అందకపోవడంతో సోమవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

తాడిపత్రి: పట్టణంలోని సీపీఐ కాలనీలో నివాసం ఉంటున్న సాయి రీతూ (18) అనే వివాహిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. సోమవారం సాయంత్రం భర్త బాలాజీతో సాయి రీతూ గొడవ పడింది. భర్త బయటకు వెళ్లగానే ఆమె ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాలాజీని అదుపులోకి తీసుకున్నారు. భార్య ఆత్మహత్య సంఘటనపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

3న హెచ్‌సీఎల్ క్యాంపస్ డ్రైవ్

గుంతకల్లు రూరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్తంగా జూన్ 3వ తేదీన అనంతపురంలో చేపడుతున్న క్యాంపస్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2022, 23 విద్యా సంవత్సరంలో 12వ తరగతి మ్యాథ్స్ లేదా బిజినెస్ మ్యాథ్స్‌లో 60శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. పూర్తి సమాచారానికి 86880 30375లో సంప్రదించవచ్చు.

విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం



గుత్తి రూరల్: వేరుశనగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



గార్లదిన్నె: రైతులకు వేరుశనగ బస్తాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి



శింగనమల: విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆలూరు సాంబశివారెడ్డి

గుత్తి రూరల్/గార్లదిన్నె/శింగనమల/పామిడి/బుక్కరాయసముద్రం/నార్పల: గుత్తి, శింగనమల నియోజకవర్గాల్లో సోమవారం వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభమైంది. గుత్తి మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ బేడల లక్ష్మీదేవి, గుత్తి మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూరుబీతో కలిసి ఎమ్మెల్యే వైవీఆర్ విత్తన కాయలు పంపిణీ చేశారు. అలాగే గార్లదిన్నె మండల పరిధిలోని ఎగువ పల్లి వైఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణతో కలిసి ఎమ్మెల్యే పద్మావతి వేరుశనగ బస్తాలు అందజేశారు. శింగనమల మండలం ఈస్ట్ నరసాపురంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, బుక్కరాయసముద్రంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, పామిడి మండలంలోని దేవరపల్లిలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి తదితరులు విత్తన వేరుశనగ కాయలు అందజేశారు. రైతులు విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.